# సాయం

రిజర్వేషన్ కౌంటర్ దగ్గర అసహనంగా నిలబడి ఉన్నాడు గోపాలం.

అతను అలా నిలబడి అప్పటికి పావుగంట దాటిపోతుంది. కాని- ఆ కౌంటరులో మనిషి అనే శాల్తీ ఏది కనపడ లేదు. పైగా ఓ కొవ్వొత్తయినా ఎవరు వెలిగించలేదు. ఆ ఊరులో కరెంట్ పోయి గంట దాటిపోయింది!

మర్నాడు అతను విజయవాడ వెళ్ళాలి. ఇవ్వాళ సీటు రిజర్వు చేయించుకోకపోతే రేపు తనకు మంచి సీటు దొరకదు. సాధారణంగా గోపాలం వెనక సీటు కాని- పక్క సీటు కాని ఇష్టపడడు. అతనికి విండోసీటు- అందునా టూ సీటర్లోనే కావాలి- వీలైతే బస్సు మధ్యలో. అతనికదో సెంటిమెంట్! సహనం నశించి 'విచారణ'లో విచారించాడు. ఎంక్వయిరీ క్లర్క్ చీకట్లోనే గోపాలాన్ని ఎగాదిగా చూసి "కరెంటు పోయింది కనపడ్డంలా?" కసురుకున్నాడు.

"కనపడక పోవడానికి నేనేం గుడ్డివాణ్ణికాను."

"చీకట్లో ఎలా రిజర్వేషన్ చేస్తారనుకున్నావు మరి?"

"డ్యూటీ అవర్స్ కాబట్టి కరెంటు పోయిందని శాలరీ కట్ చేయడం లేదుగా!"

"క్యాష్ షార్టయితే నువ్విస్తావా?"

"ఎందుకుతక్కువవుతుంది ఓ కొవ్వొత్తి వెలిగించి పెట్టుకొని పని చెయ్యచ్చుగా!"

"ఆ కొవ్వొత్తి నువ్వుకొనిస్తావా?"

"నేనెందుకు కొనివ్వాలి మీ కార్పొరేషన్ ఏం చేస్తోన్నది?"

"దానికి బోల్డంత ప్రొసీజర్!"

"అస్సలు ఓ జనరేటర్ పెట్టుకోగూడదు?"

"తేరగా వస్తుందా, పైసలు కావద్దా?"

"లక్షరూపాయలు వ్యాపారం చేసే వాళ్ళుకూడ ఈ పవర్ కట్ సీజన్లో జనరేటర్లు కొనుక్కుంటున్నారు, కోట్ల మీద వ్యాపారం చేసే మీరు కొనుక్కోలేరా?"

"మీ సలహా సజెషన్ బాక్సులో పడెయ్! వెళ్ళవయ్యా వెళ్ళు." అంటూ చిరాకుపడ్డాడు. ఆ గుమస్తా

ఇంకా గొడవపడితే రిజర్వేషన్ కూడా యివ్వరేమోనన్న అనుమానం వచ్చి వెనక్కి తగ్గాడు గోపాలం.

విసుగ్గా ఆ ప్లాట్ ఫారం మీద పచార్లు మొదలెట్టాడు. అప్పుడప్పుడు బస్టాండ్‌లోకి వస్తున్న బస్సుల హెడ్ లైట్లు అక్కడక్కడ కాంతి రేఖల్ని విరజిమ్ముతున్నాయి.

ఆ చీకట్లో ఒక్కసారిగా మెరుపు మెరిసినట్లయింది గోపాలానికి!

"అప్సరస!" అనుకున్నాడు. భూమికి ఆకర్షణ శక్తి ఉన్నట్లుండి ఎక్కువయి గోపాలం పాదాలు నేలకు అతుక్కుపోయాయి.

కొన్ని నిమిషాల తర్వాత అతని దృష్టి పథంలో ఆమె పక్కన కూర్చున్న మనుష్యాధముడు కనిపించాడు.

అతన్ని చూస్తుంటే గోపాలానికి ఈర్ష్య కలిగింది. పైగా ఒళ్ళు మండింది.

హఠాత్తుగా గోపాలం చూపు ఆ వ్యక్తి ముఖం పైకి అతను కళ్ళకు పెట్టుకున్న గాగుల్సు పైకి వెళ్లింది.

చీకట్లో కూడా నల్ల కళ్ళద్దాలు పెట్టుకున్న వాడిని ఏమనాలి – ఏమనుకోవాలి? ఫ్యాషనా ?

ఇంతలో ట్యూబ్ లైటు వెలిగింది అతని బుర్రలో కొంపదీసి ఇతగాడు గుడ్డివాడు కాదు కదా? అనుకొన్నాడు.

అంతే! ఆ ఆలోచనరాగానే ఆమె పైన గోపాలానికి టన్నులకొద్దీ జాలి ముంచుకొచ్చింది. ఆమె మెరుపు తీగలా నిండు యవ్వనంలో ఉంది. తన అందంతో అందరి గుండెలుఅదరకొట్టెయ్యగలదు, గుడ్డివాళ్ళ ను చెయ్యగలదు – కొందర్ని గుడ్డి వాళ్ళను చెయ్యగలదు !.

పాపం ! ఆమె కేం ఖర్మ ఈ అంధుడితో కాపురం చేయడానికి! ఆమెది ఎంత విశాల హృదయము!

ఆమె పట్ల కలిగిన జాలి అతనికి అమితమైన ధైర్యాన్ని యిచ్చింది.హుందాగా నడుచుకుంటూ వెళ్ళి ఆమె పక్క కుర్చీలో కూర్చున్నాడు గోపాలం.

ఆమె తల తిప్పి గోపాలాన్ని చూసింది.

కరెంట్ కట్టయినా గోపాలానికి షాక్ కొట్టింది "ప్చ్! ఈ వెధవ కరెంటు ఎప్పుడొస్తుందో!" స్వగతంగానే ప్రకాశంగా అన్నాడు గోపాలం.

"మరే ! పోయి చాలా సేపయింది." అందామె

ఆ కాలంలో వసంత కాలం వచ్చింది.కోయిలలు కూస్తున్నాయి – అతని మనస్సులో !

గోపాలం ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాడు.

"వెధవది జనరేటర్ కూడా పెట్టరు...... ఆఁ ! మీరున్నారని వాళ్లకు తెల్సింది కాబోలు వద్దనుకున్నారు..." నవ్వులు ఒలకబోశాడు చనువు తీసుకుంటూ.

ఆమె కర్థమైనట్లుంది .. మందహాసం చేసింది.

ఆమె భర్త పట్ల గోపాలానికి ఇంకో అనుమానం కలిగింది . అతను చెవిటివాడు కూడానేమో ! చాలా సినిమాల్లో చూశాడు పుట్టు గుడ్డి,పుట్టు చెవిటి,పుట్టు మూగ! కాని ఈ మూడు కలబోసిన అతన్ని చూస్తే గోపాలానికి చచ్చేంత జాలి కలిగింది . ఆ తర్వాత ఆమె దుస్థితికి దుఃఖం కలిగింది.

"ఎక్కడికి పోవాలి?" జేబులోంచి చేతి రుమాలు తీసుకుంటూ కావాలని ఆమె ఒంటికి తన చేతిని తగిలించాడు.మళ్ళీ షాక్ కొట్టింది గోపాలానికి.

"టౌన్‌లోకి – కర్నూలురాగానే కరెంటు పోయింది.అసలే ఈ ఊరు కొత్త ఏమీ తెలీదు -- లైట్లు వచ్చిన తర్వాత వెళ్ళదామని కూర్చున్నాం – పైగా లగేజి జాస్తీగా ఉంది...." ఆమె మెత్త మెత్తగా తమ సమస్య చెప్పింది.

ఇక గోపాలం విజృంభించాడు.

"మీ కేంభయం లేదు – నేనున్నాను.ఈ ఊళ్ళో మీ కెవరూ లేరని అనుకోవద్దు – ఏం సాయం కావాలో చెప్పండి.ఈ సామాన్లన్ని బయటకు చేర్చమంటారా ? ఆటో ఎక్కించమంటారా ?" కాలరు ఎగరేస్తూ అడిగాడు ఆత్రంగా.

"అయ్యో! మీ కెందుకండి శ్రమ!" మొహమాట పడిందామె.

"వెధవది ! మానవజన్మ ఎత్తింతర్వాత మీ తర్వాత మీ లాంటి వాళ్ళకు ఈ మాత్రం సాయం చెయ్యకపోతే ఎలా?" అంటూ ఆవేశంతో ఊగిపోతూ అక్కడున్న రెండు సూట్‌కేసుల్ని రెండు చేతుల్లోకి తీసుకున్నాడు,ఎయిర్ బ్యాగ్‌ని భుజానికి తగిలించుకున్నాడు,ఇంకో బుట్ట ఉంటే సూట్‌కేసున్న చేత్తోనే తంటాలుపడి పట్టుకుని ముందుకు నడిచాడు.

ముందు అతను - అతని వెనుక ఆమె- ఆ వెనుక ఆమె భుజంపట్టుకు- ఆమెభర్త- అనుసరించారు

గోపాలం ఓ ఆటోని పిల్చి సామాన్లు సర్దాడు. "ఎక్కడికి పోవాలి?" ఆటోవాలా అడిగాడు గోపాలాన్ని.

"పి. జి. సెంటరుకు." ఆమె చెప్పింది.

ఆమె లెక్చరరు అయ్యుంటుంది. బహుశ... టూర్‌మీద అక్కడికి వచ్చి ఉంటుంది- ప్రాక్టికల్స్ ఎగ్జామినర్‌గా అనుకొన్నాడు గోపాలం అంతలో కరెంట్ వచ్చింది.

"థాంక్స్! అయిదు రూపాయలు మిగిల్చారు."

ఉలిక్కిపడ్డాడు గోపాలం!

ఆమె భర్త మాట్లాడుతున్నాడు. కళ్ళజోడు మడిచి జేబులో పెట్టుకుంటూ.

"మావారు! ఫిజిక్స్ ప్రొఫెసరు ఎస్. వి. యూనివర్సిటీలో-" ఆమె పరిచయం చేసింది.

"ఆయన గుడ్డి... చెవిటి కాదా....." చెమటలు పడుతుంటే అడిగాడు గోపాలం.

బిత్తరపోయింది ఆమె.

కాసేపటికి తేరుకుని చెప్పింది.....

"ఇందాక మా వారు ప్రార్థన చేసుకుంటున్నారు... రోజు అదే వేళకు ఆయనకు ప్రార్థన చేసుకోవడం అలవాటు.... ఒకే బై!"

ఆటో లోంచి యిద్దరూ చెయ్యి ఊపారు.

వెళ్ళిపోతున్న ఆటోను చూస్తూ నిశ్చేష్టుడై నిల్చుండి పోయాడు గోపాలం.

(24-7-88 ఆంధ్రప్రభ దినపత్రిక)

